7

సాక్షి అనకాపల్లి

సోమవారం । 16 । డిసెంబర్ । 2024




చాపరాయికి భారీ ఆదాయం

ప్రముఖ పర్యాటక ప్రాంతం చాపరాయి జలవిహారికి రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. సెప్టెంబర్‌లో రూ.3,67,390, అక్టోబర్‌లో రూ. 18,84,270, నవంబర్‌లో రూ.14,00,210, మూడునెలల్లో రూ.36,51,870 ఆదాయం సమకూరిందని చాపరాయి జలవిహారి నిర్వాహకులు తెలిపారు. -డుంబ్రిగుడ

రియల్.. నేల చూపులు

రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు నేలచూపులు చూస్తోంది. జిల్లాలో ఆస్తుల క్రయవిక్రయాలు భారీగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూములు, ఇళ్ల క్రయవిక్రయాలపై స్తబ్ధత నెలకొంది. దీంతో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రియల్టర్లు, కమీషన్‌దారులు, దస్తావేజులేఖరులు, ప్రైవేటు సర్వేయర్లు, నిర్మాణ రంగంలో ఉన్న వారందరి బతుకులు అతలాకుతలమవుతున్నాయి. రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయం పడిపోయింది.



యలమంచిలి సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్

- మందగించిన కొనుగోళ్లు
- కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పడిపోయిన రిజిస్ట్రేషన్లు
- అమ్ముడుపోని ఇళ్లు
- భూముల అమ్మకాలూ అంతంతే
- తగ్గిన క్రయవిక్రయాలతో వ్యాపారులకు ఇబ్బందులు

యలమంచిలి రూరల్: భూములు,ఇళ్లు,ఇళ్ల స్థలాల క్రయ,విక్రయాలు పూర్తిగా తగ్గడంతో రియల్ వ్యాపారం సంక్షోభంలో పడింది. కరోనాతో రియల్ వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత అనకాపల్లి,యలమంచిలి,పరవాడ,చోడవరం,నర్సీపట్నం,పాయకరావుపేట ప్రాంతాలతో పాటు 16వ నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములు, ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటైన అచ్యుతాపురంలో భూములు, ఇళ్ల ధరలు పెరిగాయి.దీంతో రియల్ వ్యాపారంలో కదలిక వచ్చి క్రయ,విక్రయాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రియల్ వ్యాపారం చతికిలపడింది. ప్రత్యక్షంగా,పరోక్షంగా ఈరంగంపై ఆధారపడి జీవించే రియల్టర్లు, కమీషన్‌దారులు, దస్తావేజులేఖరులు, ప్రైవేటు సర్వేయర్లు ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులు తెచ్చి మరీ ఈ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు,మధ్యవర్తులు తలలు పట్టుకుంటున్నారు.రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో ప్రభుత్వ ఆదాయం సైతం తగ్గిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభంలో పడడంతో పలువురు వ్యాపారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారు.మరికొందరు పెద్ద వ్యాపారులు,ఇన్వెస్టర్లు ఇప్పటికే ఈ రంగంపై పెట్టే పెట్టుబడులను ఇతర బిజినెస్‌ల వైపు మళ్లించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందకుండా పోవడం కూడా ప్రస్తుత రియల్ ఎస్టేట్ వ్యాపారం చతికిలపడిపోవడానికి ప్రధాన కారణంగా వ్యాపారులు,మధ్యవర్తులు చెబుతున్నారు.రియల్ జోరు తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు బోసిపోతున్నాయి.

పెరిగిన ధరలతో కుదేలు

జిల్లాలో భూములు,ఇళ్ల స్థలాలు,ఇళ్ల ధరలు ఆకాశాన్నంటడంతో ఆ ప్రభావం అమ్మకాలు,కొనుగోళ్లపై పడింది.ఆస్తుల క్రయ విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. గత ఏడాదితో పోల్చితే రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పడిపోయింది.జిల్లా కేంద్రం అనకాపల్లితో పాటు నియోజకవర్గ కేంద్రాలు,అచ్యుతాపురం వంటి ప్రాంతాల్లో భూముల ధరలు తార స్థాయికి చేరాయి.కొన్ని చోట్ల గజం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు కూడా ఉంటోంది.పట్టణాలు,గ్రామాలకు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కూడా సెంటు రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెబుతున్నారు.ఇక యలమంచిలి,నర్సీపట్నం, పాయకరావుపేట,చోడవరం వంటి పట్టణాల్లో పలు కాలనీల్లో ప్లాట్లు కొనాలంటే గజం రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వెచ్చించాల్సిందే.ఇక ప్రధాన కూడళ్లు,రద్దీగా ఉండే అంతర్గత రహదారులు,వాణిజ్య ప్రాంతాల్లో అయితే ప్లాట్ల ధరలు వినడానికి కూడా సామాన్యులు సాహసించడంలేదు. ఇలాంటి ప్రాంతాల్లో గజం రూ.50 వేల పైమాటే.ఒకవైపు నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోవడంతో కుటుంబ ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులు నివాస స్థలం కొనుగోలు చేయడం సాధ్యం కాని పరిస్థితిగా ఉంది.సొంత ఇంటి నిర్మాణం కోసం కనీసం 200 గజాల ప్లాటు కొనాలంటే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఉంది.అనకాపల్లి, నర్సీపట్నం,యలమంచిలి పట్టణాల్లో ఆస్తి పన్ను భారీగా పెరిగిపోయింది.ఈ పరిస్థితుల్లో చాలామంది అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు.అమ్మకాలు లేకపోయినా ప్లాట్ల ధరలు మాత్రం తగ్గడం లేదు. ఇళ్లు కట్టుకోవాలనుకుంటున్నవారు మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి పెట్టాలనుకునే వారు మాత్రం ప్లాట్లు కొనేందుకు ముందుకు రావడంలేదు.రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్ధత కారణంగా గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అమ్ముదామంటే కొనేవారు లేని పరిస్థితి నెలకొందని వ్యాపారులు చెబుతున్నారు.ప్రస్తుత పరిస్థితితో బిల్డర్లు కూడా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మరి కొద్ది రోజులు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు.

జిల్లాలో 2023,2024 సంవత్సరాల్లో జూన్ నుంచి డిసెంబర్ వరకు రిజిస్ట్రేషన్ల వివరాలు

నెల	2023	2024
జూన్	6,959	4,640
జూలై	7,246	5,864
ఆగస్ట్	7,096	5,902
సెప్టెంబర్	7,045	5,288
అక్టోబర్	6,125	5,742
నవంబర్	6,623	6,305
డిసెంబర్	5,985	2487 (ఈ నెల 15 వరకు)
మొత్తం	47,079	36,228



కక్షిదారులు లేక బోసిపోయిన యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తగ్గిన క్రయవిక్రయాలు

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్ధత నెలకొనడంతో గత ఆరు నెలల కాలంలో క్రయవిక్రయాలు నెమ్మదించాయి. 2024 జూన్ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు జిల్లాలో 36,228 రిజిస్ట్రేషన్లు జరిగాయి.రూ.181.06 కోట్ల ఆదాయం స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖకు వచ్చింది.2023 జూన్ నుంచి డిసెంబరు వరకు 47,079 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.202.06 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత సంక్షోభంలోకి వెళ్లింది.రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు వస్తున్నాయి,పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోందని కూటమి ప్రభుత్వ పెద్దలు తమ ప్రసంగాల్లో ఊదరగొడుతున్నా జిల్లాలో రియల్ ఎస్టేట్ తిరోగమనంలో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజువారీగా గతంలో 100 నుంచి 120 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి.మరికొన్ని కార్యాలయాల్లో రోజుకు 70 వరకు లావాదేవీలు నమోదయ్యేవి.కానీ ప్రస్తుతం చాలా కార్యాలయాల్లో రోజుకు 40 నుంచి 60 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.వాటిలో కూడా 30 నుంచి 40 వరకు డాక్యుమెంట్లు మార్ట్‌గేజ్ చేయడం,మార్ట్‌గేజ్ రిలీజ్ డాక్యుమెంట్లు ఉంటున్నాయి.క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు రోజుకు కేవలం 15 నుంచి 30కి మించడంలేదు.

నిలిచిన నిర్మాణాలు



జిల్లా వ్యాప్తంగా పట్టణాలతో పాటు నియోజకవర్గం,మండల కేంద్రాల్లో అమ్మకాలు, భవన నిర్మాణాలు స్తంభించాయి. ప్లాట్లు అమ్ముడుపోవడంలేదు.దీంతో రియల్ ఎస్టేట్‌ను నమ్ముకున్న అనేక మంది ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

-దూది నర్సింహమూర్తి, ఎర్రవరం, యలమంచిలి మున్సిపాలిటీ

రిజిస్ట్రేషన్లు తగ్గాయి



గతంతో పోల్చితే భూములు,ఇళ్లు,ఇళ్ల స్థలాల క్రయ విక్రయాలు మందగించాయి. రిజిస్ట్రేషన్లు బాగా తగ్గిపోయాయి. గతంలో క్షణం తీరిక లేకుండా చేతినిండా పని ఉండేది. కానీ ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ నేలచూపులు చూస్తోంది. పెరిగిన ప్లాట్ల ధరలు తగ్గవు. కానీ లావాదేవీలు బాగా నెమ్మదించాయి. క్రయ ఒప్పందాలు కుదుర్చుకున్న లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు సకాలంలో జరగడంలేదు. మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవాలంటే కొంతకాలం ఆగక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

- పిల్లా రాము, డాక్యుమెంట్ రైటర్,యలమంచిలి

అప్పులపాలైన వ్యాపారులు

ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ జోరుగా సాగడంతో వ్యాపారుల్లో కొందరు కోట్ల రూపాయలు గడించారు.వారిని చూసి మరికొందరు ఈ వ్యాపారంలో దిగారు.ప్రైవేటుగా ఫైనాన్స్ తెచ్చి పెట్టుబడులు పెట్టారు.గత ఆరు నెలల నుంచి రియల్ వ్యాపారం పడిపోయింది. పెట్టుబడులకు అప్పులు చేసి తెచ్చిన డబ్బుకు వడ్డీలు పెరిగి వ్యాపారులు కుదేలైపోయారు.దీంతో వ్యాపారులతో పాటు మధ్యవర్తులు, భూముల యజమానులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.పెరిగిన ధరలు తగ్గే అవకాశాలు లేవు.నష్టానికి ఎవరూ అమ్మే పరిస్థితిలేదు.ప్రస్తుతం ఉన్న ధరలతో అమ్మకాలు సాగడంలేదు.పెట్టుబడులకు తెచ్చిన డబ్బుకు వడ్డీ పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారు.అప్పులు చేసి కొనుగోలు చేసిన భూములను అమ్మినా అప్పులు తీరే పరిస్థితి కనిపించడంలేదని కొందరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.ఇక మధ్యవర్తిత్వం ద్వారా జీవనం సాగించే అనేక మంది కుటుంబ పోషణకు సైతం ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.రియల్ రంగానికి ఎప్పుడు మంచి రోజులు వస్తాయోనని వ్యాపారులు,మధ్యవర్తులు,ఈ రంగంపై పరోక్షంగా ఆధారపడినవారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆకాశంలో ధరలు



సొంత ఇల్లు కట్టుకోవడానికి స్థలం కొనుగోలు చేద్దామని వెతుకుతుంటే ధరలు బాగా ఎక్కువగా ఉంటున్నాయి.అంత ధర పెట్టి ప్లాటు కొనాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి.రెండు సెంట్ల స్థలం సుమారు రూ.25 లక్షలు చెబుతున్నారు.అంత పెద్ద మొత్తం పెట్టి స్థలం కొనుగోలు చేస్తే ఇక భవన నిర్మాణం ఎలా చేయగలుగుతాం.ధరలు తగ్గితే కొనుగోలుదారులు ముందుకొస్తారు.

- వసగడుగుల రమేష్, బైక్ మెకానిక్,రుక్మిణీపురం

జిల్లాలో 2023,2024 సంవత్సరాల్లో జూన్ నుంచి డిసెంబర్ వరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు వచ్చిన ఆదాయం

నెల	సంవత్సరం, ఆదాయం (రూ.కోట్లలో) 2023	2024
జూన్	30.91	23.89
జులై	28.74	29.03
ఆగస్టు	28.60	29.65
సెప్టెంబర్	31.04	25.44
అక్టోబర్	27.53	26.12
నవంబర్	28.89	31.94
డిసెంబర్	26.35	14.99 (ఈ నెల 15 వరకు)
మొత్తం	202.06	181.06

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ

విశాఖ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో విజయసాయిరెడ్డి, బొత్స, అమర్‌నాథ్



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, ఎంపీ తనూజరాణి, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు

సాక్షి, విశాఖపట్నం: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ భరోసానిచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికలు, జీవీఎంసీ ఎన్నికల విజయోత్సవాలు చేసుకున్న పార్టీ కార్యాలయాన్నే మళ్లీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని కృష్ణా కళాశాల సమీపంలో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ నెల 27న కరెంట్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు రీజినల్ కోఆర్డినేటర్‌గా మళ్లీ రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు గత ఎన్నికల్లో ఓడిపోయామనే ఆందోళన అవసరం లేదన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు అసంతృప్తికి గురయ్యారని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ముందుకు సాగాలన్నారు. 2027 ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పార్టీ జిల్లా కార్యాలయం ఎండాడలో ఉన్నా, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలనే నగర పార్టీ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. పార్టీ పదవులు అనుభవించి భీమిలి నుంచి ఒక వలస నాయకుడు రాజీనామా చేస్తే, ఆ నియోజకవర్గం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తే కార్యకర్తలు, నాయకులు అందరూ హాజరయ్యారన్నారు. నాయకుడు పోతే కార్యకర్త వెళ్లడనే విషయం తెలుసుకోవాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కార్యకర్తలంతా సమష్టి కృషితో పనిచేయాలని పిలుపు నిచ్చారు. అరకు ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి వైపు నడిపించాలంటే వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, చెంగల వెంకట్రావు, ముఖ్యనేతలు కాయల వెంకటరెడ్డి, రొంగలి జగన్నాథం, జాన్ వెస్లీ, కొండా రాజీవ్‌గాంధీ, చొక్కాకుల వెంకట్రావు, డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఉడా రవి, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ రంగ రంగ నాథుని దివ్య రూపమే కొలువరే..

- నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు
- జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఉపమాకలో టీటీడీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- ఉదయం 6.57 గంటలకు నెలగంట

శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన ధనుర్మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి సాక్షాత్తు శ్రీరంగనాథుని వివాహం చేసుకుంటానని దీక్ష పూనుతారు. తన అనుభూతిని, భావాలను పాశురం రూపంలో రచించి 30 పాశురాలను విష్ణువుకు అంకితం చేస్తారు. ఆమె భక్తికి ముగ్ధుడైన శ్రీరంగనాథుడు గోదాదేవిని పరిణయమాడతారు. ఈ ఉత్సవాల కోసం జిల్లాలో వైష్ణవ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయం, గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయం, మాడుగులలో పాండవుల కొండపై గల అతి పురాతన పార్థసారథి ఆలయంతో పాటు జిల్లాలోని పలు ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయి. ధనుర్లగ్న ప్రవేశమునను సరించి సోమవారం ఉదయం 6.57 గంటలకు విశేష ప్రసాద నివేదనలు అనంతరం ఘంటానాదం(నెలగంట) జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా జనవరి 10 తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి)ని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు రంగనాథుని అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.



8లో

25 నుంచి గోవాడ సుగర్స్ క్రషింగ్

బాయిలర్ పూజ చేసి పనులు ప్రారంభించిన ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈనెల 25వ తేదీ నుంచి క్రషింగ్ నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పూజచేసి, బాయిలర్‌ను వెలిగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రషింగ్ కోసం సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది 2 లక్షల టన్నుల చెరకు గానుగాడాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్రషింగ్ ప్రారంభ సమయానికి విద్యుత్ సరఫరాతోపాటు స్టీమ్ ఎక్కువగా అవసరం. బాయిలర్‌ను ప్రారంభిస్తే ఆ సమయానికి అవసరమైన స్టీమ్ ఉత్పత్తి అయ్యి క్రషింగ్‌కు కావలసిన అన్నీ అందుబాటులోకి వస్తాయి. పూజా కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఎండీ పీఏ రవి, సీఈ ప్రసాద్, ఇంజినీర్లు తిరుమలరావు, ప్రకాష్, సీఏవో రామం, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు, కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు పాల్గొన్నారు.




బాయిలర్‌ను వెలిగిస్తున్న సన్యాసినాయుడు

అడవుల రక్షణ అందరి బాధ్యత

చోడవరం రూరల్: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణం టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని అటవీశాఖ చోడవరం రేంజ్ అధికారి రవివర్మ కోరారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అడవుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. నిత్యం అడవుల్లోకి జరిగే ప్రమాదాల నివారణకు అందరూ తక్షణం స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 5909, చోడవరం రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 94441459400, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ 9491872256, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫోన్‌నంబర్ 9493434910కు సమాచారం అందించి అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

21 నుంచి ఉభయరాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

అనకాపల్లి: పట్టణం నాటికలకు పుట్టినిల్లు అని జార్జి క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల కరపత్రాలను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటకోత్సవాలను ఈ నెల 21,22,23 తేదీల్లో క్లబ్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన తెలుగు డ్రామా, జార్జిక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి 'ఉక్కుసంకెళ్లు', రాత్రి 8 గంటలకు విశాఖ, ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారి '(అ) సత్యం', 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి', రాత్రి 8 గంటలకు బాపట్ల జిల్లా వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్', 23వ తేదీ సాయంత్రం 6గంటలకు అనకాపల్లి షిర్డీసాయి కుల్వంత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'వేదాంతం', రాత్రి 8 గంటలకు ఉత్తరాంధ్ర వారి సౌజన్య కళా స్రవంతి వారి 'దేవరాగం' అనే నాటకాలను ప్రదర్శించనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, నాటకోత్సవాల కన్వీనర్ కె.ఎం. నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ ఎం.శ్రావణి

8లో

క్లుప్తంగా

కాలుష్యంతో జలచరాలు మృత్యువాత


పూడిమడక తీరంలో తాబేళ్ల కళేబరం

అచ్యుతాపురం: కాలుష్యంతో మత్స్య సంపదకు భారీ నష్టం వాటిల్లుతోంది. తాబేళ్లు, ఇతర జలచరాల కళేబరాలు నిత్యం పూడిమడక తీరానికి కొట్టుకువస్తున్నాయని ఆ గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి శ్రీనివాసరావు, గ్రామస్తులు తెలిపారు. అరుదైన తాబేళ్లు మరణిస్తున్నాయని, వాటిని కాపాడాలని ఆయనతోపాటు పలువురు కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వృద్ధుడి మృతదేహం

అనకాపల్లి: స్థానిక శారదానది పాత బ్రిడ్జి వద్ద సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగిన వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆదివారం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇక్కడే నివసిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారని, ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి


పేకాట శిబిరంలో నిందితులతో పోలీసులు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు శివారు సీతారాంపురం గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఈ దాడుల్లో రూ.67 వేలు, 7 బైకులు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్ట్

పెదఉప్పలం గ్రామంలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ధనుర్మాసోత్సవాలకు వేళాయె..

- నేటి ఉదయం 6.57 గంటలకు నెల గంట ప్రారంభం
- జనవరి 10న ముక్కోటి ఏకాదశి
- 13న గోదా రంగనాథుల కల్యాణం


ఉపమాక వేంకటేశ్వర స్వామి వారి ఆలయం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాలకు వేళయింది. ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరం ధనుర్లగ్న ప్రవేశమునను సరించి ఉదయం 6.57 గంటలకు ఘంటానాథం(నెలగంట) జరుగుతుంది. సోమవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్కి వేంకటేశ్వర స్వామివారికి, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రతి రోజు రెండు వాహనాల్లో ఒకే సమయంలో గ్రామ తిరువీధి సేవలు టీటీడీ ఆధ్వర్యంలో జరగనున్నాయని ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

వచ్చే నెల 10న ఉత్తర ద్వార దర్శనం

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా జనవరి 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశిని(వైకుంఠ ఏకాదశి) పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు రంగనాథుని అలంకరణ చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. భద్రచలం, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశి నాడు మాత్రమే ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఉపమాకలో మాత్రం గరుడాద్రిపై షడ్భుజాలతో అశ్వంపై కూర్చొని కల్కి అవతారంలో ఉన్న స్వామివారి మూల విరాట్‌ను నిత్యం ఉత్తర ద్వారం ద్వారానే దర్శనం కలుగుతుంది.

13న గోదా కల్యాణం

వచ్చే ఏడాది జనవరి 13న భోగి పండగను పురస్కరించుకుని గోదారంగనాథుల కల్యాణం ఉపమాకలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు స్వామివారి పుష్పతోటలో ఈ కల్యాణాన్ని జరగనుంది. 14వ తేదీ మంగళవారం ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశంలో స్వామివారి తిరువీధి సేవలు నిర్వహించనున్నారు.

జనవరి 15న స్వామివారి గిరిప్రదక్షిణ

జనవరి 15వ తేదీ కనుమ పండగను పురస్కరించుకుని స్వామివారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంలో అధిష్ఠింపజేసి సాయంత్రం 5 గంటలకు భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడాద్రి చుట్టూ గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం లంకవారి మండపం వద్ద కరిమకర సంవాదోత్సవం జరపనున్నారు. ధనుర్మాసోత్సవాలకు సంబంధించి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసిందని ప్రధానార్చకుడు తెలిపారు.

వైష్ణవాలయాలు ముస్తాబు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలోని వైష్ణవాలయాలు సోమవారం నుంచి జరిగే ధనుర్మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని వీరాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయం, ధర్మవరం ఉమావేంకటేశ్వర స్వామి ఆలయం, పురాతన వేణుగోపాల స్వామి ఆలయంతో పాటు బస్టాండు సమీపంలో కొమ్మాయి గుండం చెరువుగట్టున ఆంజనేయస్వామి ఆలయం పక్కనున్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు ధనుర్మాస ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. మండలంలోని మైహోం ఇండస్ట్రీస్ సిమెంట్ కర్మాగారంలో కొలువుదీరిన వ్యూహలక్ష్మీ సమేత శ్రీనివాసుడి ఆలయంలో ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని వీరాద్రి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.


వీరాద్రి పర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి


ధర్మవరంలో ధనుర్మాసోత్సవాలకు సిద్ధమైన ఉమావేంకటేశ్వర స్వామి

ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆదివారం సాయంత్రం ఆలయంలో సమావేశమై భక్తులకు అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. పలు ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఎంతో శుభప్రదం



విష్ణుమూర్తికి ప్రీతికరమైన ధనుర్మాసం ఎంతో శుభప్రదమైనది. అన్ని విష్ణు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నెలరోజుల పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. భక్తురాలైన గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేశారు. ఆమె స్వామిలో ఐక్యమవడంతో 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పెళ్లికాని యువతులు ఇంటి ముందు, ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు దొరుకుతాడని ప్రతీతి. భక్తులంతా ధనుర్మాస వ్రతాలు ఆచరిస్తే మంచి జరుగుతుంది.

– ఎరసూరి సీతారామ సుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకుడు, వీరాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయం, యలమంచిలి

ధనుర్మాస ఏర్పాట్లు షురూ..


గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాలకు మెరుగు దిద్దుతున్న అర్చకుడు

చోడవరం: వైష్ణవాలయాలన్నీ ధనుర్మాసం పూజలకు ముస్తాబయ్యాయి. ఆలయ ప్రాంగణాలన్నీ శుభ్రం చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుజామున నెలగంట మోగడంతో ధనుర్మాస పూజలు ఆలయాల్లో ప్రారంభం కానున్నాయి. అతి ప్రాచీన దేవాలయాల్లో 800 ఏళ్ల నాటి చరిత్ర ఉన్న వైష్ణవాలయాలు చోడవరం పరిసరాల్లో ఉన్నాయి. ప్రసిద్ధిగాంచిన చోడవరం శ్రీకేశవస్వామి దేవాలయం, వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు చోడవరం, గోవాడ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాల్లో ఉత్సవ మూర్తులకు మెరుగులు దిద్దారు. మూలవిరాట్ విగ్రహాలను శుభ్రం చేశారు. ఆలయాలకు పెయింటింగ్‌లు వేసి, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. తిరువీధి రథాలు, పల్లకీలు సిద్ధం చేశారు. అత్యంత పవిత్రంగా, పుణ్య మాసంగా భక్తులు భావించే ఈ ధన్మురాసం ఉత్సవాలకు ఆయా ఆలయ ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అనకాపల్లి డీఎస్పీ నాగేశ్వరరావు

అనకాపల్లి/తుమ్మపాల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆదివారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి, ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.ఎస్.వి.కె.జి.ఎస్.ఎల్. సత్యనారాయణరావు, గ్రామ,వార్డు సచివాలయ అధికారి మంజుల వాణి, కలెక్టరేట్ సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఫలితంగా ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు.

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని అనకాపల్లి జిల్లా డీఎస్పీ పి.నాగేశ్వరరావు కొనియాడారు. విశాఖ జిల్లా విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పోలీస్ అధికారులతో కలిసి డీఎస్పీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

రక్షణ కల్పించాలని పోలీసులకు వినతి


విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు

చోడవరం రూరల్: తమకు రక్షణ కల్పించాలని మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన వితంతువు దొడ్డి శ్యామల తన పిల్లలతో కలిసి చోడవరం పోలీసులను వేడుకుంది. అలాగే ఆమె తల్లి కొయిలాడ లక్ష్మి కూడా సీఐ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా శ్యామల విలేకరులకు ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. తన భర్త దొడ్డి వెంకటరమణ అప్పుల బాధ తాళలేక గత ఆగస్టు 20న రైలు కిందపడి చనిపోయారన్నారు. అప్పటి నుంచి తనతో పిల్లలను అదే గ్రామానికి చెందిన దొడ్డి ఈశ్వరరావు, కళావతి, రమేష్, వారి తండ్రి ఎంపీటీసీ సభ్యుడు నాయుడు, ఆడారి దుర్గనాయుడు మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై గత సెప్టెంబర్ 21న చోడవరం పోలీసులను ఆశ్రయించడంతో ఇరు వర్గాలతో మాట్లాడి పంపించారని తెలిపారు. భోగాపురం గ్రామానికి చెందిన తన తల్లిదండ్రులు కొయిలాడ లక్ష్మి, రమణ నర్సాపురానికి వచ్చి పొలం పనులు చేస్తున్నారన్నారు. ఆదివారం వారిని ఇంట్లో బంధించి చంపేస్తామంటూ బెదిరించడమే గాకుండా తనపైనా చేయి చేసుకుని పిల్లల్ని సైతం హతమారుస్తామంటున్నారంటూ హెచ్చరించినట్టు శ్యామల ఫిర్యాదులో పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి: ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గవరపాలెం జిల్లా మలేరియా కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా కె.గీతారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సూర్య శంకరరావు, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులుగా లక్ష్మణరావు, సీహెచ్.శ్రీనివాస్‌బాబు, టి.హిమబిందు, ఐ.సుజాత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.అప్పలరాజు, సహాయ కార్యదర్శులుగా ఐ.రాజాబాబు, ఎం.అప్పలరాజు, డి.వెంకట సుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, వి.వి.వి.ఎల్.పద్మవతిదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా టి.ఉమామహేశ్వరి, కె.మహావిష్ణు ఎన్నికయ్యారు. ఎన్నికలు అధికారిగా అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి బాబు నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు.

లోకేష్ ఆదేశించినా ఫలితం శూన్యం

- మంత్రిని కలిసేందుకు 3 రోజులు విజయవాడ బస్టాండులో నిద్రపోయా..
- టీడీపీ ఆఫీసు నుంచి ఫోన్ చేసి నీ పని అయిపోయిందన్నారు..
- అయినా భూమి ఆన్‌లైన్ కాలేదని ఓ రైతు గగ్గోలు


మాట్లాడుతున్న గోవిందరావు

నాతవరం: తన భూమిని ఆన్‌లైన్‌లో సరి చేయాలని సాక్షాత్తు సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశించినా ఫలితం లేదని మండలంలో ఏపీ పురానికి చెందిన రైతు పోలుపర్తి గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో తనగోడు చెప్పుకున్నాడు. మండలంలో ఏపీ పురం గ్రామానికి చెందిన పోలుపర్తి గోవిందరావుకు అదే గ్రామంలో సర్వే నంబర్లు 111లో 86 సెంట్లు, 211లో 65 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. ఈ భూమి వారసత్వంగా తల్లిదండ్రుల ద్వారా రావడంతో గతంలో ఆన్‌లైన్ వ్యవస్థ రాకముందు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చాక తన భూమిని అధికారులు ప్రభుత్వ భూమిగా తప్పుగా నమోదు చేశారని గోవిందరావు వాపోయారు. దీనిని సరి చేయాలని ఏళ్ల తరబడి అధికారులు చుట్టూ తిరుగుతున్నా కనికరించలేదన్నారు. విజయవాడలో జూలై 7న మంత్రి నారా లోకేష్‌ను కలిశానన్నారు. ఆయనన్ను కలిసేందుకు విజయవాడ ఆర్టీసీ బస్టాండులో మూడు రోజుల పాటు నిద్రపోయానన్నారు. అష్టకష్టాలు పడి లోకేష్‌ను కలిశానని, పని అవుతుందని చెప్పారన్నారు. తర్వాత తహసీల్దార్ వేణుగోపాల్ తన భూమిలోకి వచ్చి ఫొటో తీసుకుని వెళ్లిపోయారన్నారు. అయినా తన భూమి ఆన్‌లైన్ కాలేదన్నారు. విజయవాడ టీడీపీ ఆఫీసు నుంచి 'నీ పని పూర్తయిపోయిందని ఫోన్ చేశారని, తన పని కాలేదని చెప్పినా వినకుండా ఫోన్ పెట్టేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అయ్యో దేవుడా.. మాకెందుకీ శిక్ష

- మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు
- రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

యలమంచిలి రూరల్: 'బాగా చదివి మంచి ఉద్యోగం చేసి మమ్మల్ని చూస్తానన్నావు.. స్నేహితులతో సరదాగా సినిమా చూసొస్తానని వెళ్లి మాకు పుత్రశోకాన్ని మిగిల్చావు.. అయ్యో దేవుడా మేమేం పాపం చేశామని, మాకింత పెద్ద శిక్ష విధించావు.. ప్రసాదూ లేవరా.. 13 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయి'.. అంటూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన రేవుపోలవరానికి చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు, తమ్ముడు గుండెలవిసేలా రోదించారు. ఆదివారం యలమంచిలి మార్చురీ వద్ద ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది. మృతుని స్వగ్రామం రేవుపోలవరంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మండలంలో లైనుకొత్తూరు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు. ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన దారబోయిన గోవిందరావు పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్(13), అదే గ్రామానికి చెందిన అర్జిల్లి ప్రవీణ్(14) శనివారం మధ్యాహ్నం యలమంచిలిలో సినిమా చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. సినిమా చూసిన తర్వాత తమ గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద రోడ్డు దాటుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని విద్యార్థులు నడుపుతున్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై మృతి చెందిన విద్యార్థి తండ్రి గోవిందరావు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడపుతూ రోడ్డు దాటడం వల్లే ప్రమాదం జరిగి, తన కుమారుడు మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కుటుంబీకులకు విద్యార్థి మృతదేహం అప్పగింత

యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం విద్యార్థి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. సినిమా చూసొస్తానని వెళ్లిన కుమారుడు అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మార్చురీ వద్ద వారి రోదనలు మిన్నంటడం చూపరులను సైతం కంటతడి పెట్టించింది. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని పోలీసులు, రవాణా శాఖాధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొందరు తల్లిదండ్రులు ఆ హెచ్చరికలను విస్మరిస్తుండడంతో అనుకోని ప్రమాదాలతో తీరని విషాదం మిగులుతుంది. మైనార్టీ తీరని పిల్లలకు వాహనాలు ఇస్తే, వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతోపాటు, ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. మైనర్లకు వాహనాలిచ్చే విషయంలో తల్లిదండ్రులు అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

అప్రజాస్వామంగా సాగు నీటి సంఘాలు ఎన్నికలు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: రైతులు సంక్షేమం, వారి అభివృద్ధి కోసం నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎనికలను కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని చోడవరం చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ (సి.డి.సి) సుంకర శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన కె.జె.పురంలో సాక్షితో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు ఎన్నికలను బహిష్కరించిందని, అయితే ఎన్నికలు షెడ్యూల్ విడుదల నుంచి ఎన్నికల ముందు రోజు వరకు కూటమి నాయకుల ఒత్తిడి మేరకే అధికారులు వ్యవహరించారని అన్నారు. అభ్యర్థులు విధిగా పదేళ్ల పాటు నీటి తీరువా చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలతో నీటి తీరువాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతుల నుంచి నీటి తీరువా చెల్లించుకోలేదని అన్నారు. ఒక వేళ చెల్లించినా సరే నోడ్యూ సర్టిఫికేట్లు ఇవ్వలేదని, దీంతో ఎంతో మంది రైతులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేకుండా పోయిందని అన్నారు. ఎన్నికలను ఏకగ్రీవం చేసుకునేందుకు కూటమి నాయకులు అధికార యంత్రాంగాన్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకున్నారని అన్నారు. ఈ ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తే, ఓటు హక్కు వున్న ప్రతి రైతు తమ ఓటు వేసి, మంచి వ్యక్తులను అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్లుగా ఎన్నుకునేవారని అన్నారు. అలాగే ఈ ఎన్నికలను ముమ్మరంగా వ్యవసాయ పనులు సమయంలో నిర్వహించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. కూటమి నాయకులు తాము గెలవలేమన్న పలు చోట్ల నామినేషను పత్రాలను చించి వేసి, పోలీసులు, ఎన్నికలాధికారులు, పీవోలు మీద దౌర్జన్యం చేశారని విమర్శించారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

బుచ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరగనున్నాయి. గ్రామంలోని భక్త వీరంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేస్తామన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు


ట్రై సైకిల్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు


ట్రై సైకిల్ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగునికి మెమెంటో అందజేస్తున్న కాంద్రేగుల శ్రీరామ్

అనకాపల్లి: నేటి సమాజంలో దివ్యాంగులు అన్నిరంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఎస్‌డీ గ్రూప్ అధినేత కాంగ్రేడుల శ్రీరామ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన నిర్వహించవలసిన దివ్యాంగుల జిల్లాస్థాయి పోటీలను ఆదివారం శ్రీరామ్‌లు ప్రారంభించి, గెలిపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 400 మందితో అంగవైకల్యం, అంధులు, బదిరులు, మానసిక వికలాంగులకు ప్రతి ఏడాది ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటల పోటీలు దివ్యాంగులు ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు దివాంగులకు ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రై సైకిల్, రన్నింగ్, జావ్లీన్ త్రో, డిస్కత్రో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్, సింగింగ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాది కశెట్టి సురేష్, సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి గాడి బాలు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యులు కోరుకొండ నాగరాజు పాల్గొన్నారు.

మెడికల్ టూరిజంనకు విశాఖ అనువైన వేదిక

డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాశరావు

ఏయూక్యాంపస్: మెడికల్ టూరిజంనకు రాష్ట్రంలో విశాఖ నగరం అనువైన వేదిక అని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అభిప్రాయపడ్డారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన మాక్ సంస్థ తొలి వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సౌందర్యం వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, దీనిని పెంపొందించే దిశగా కాస్మటాలజీ రంగం విస్తరిస్తోందన్నారు. పైడా విద్య సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మాక్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడం కాస్మటాలజీ రంగం అభివృద్ధికి నిదర్శనమని, రెండు వందలకు పైగా చికిత్సలు అందించడం విశేషంగా పేర్కొన్నారు. ఆడారి కిశోర్ కుమార్ మాట్లాడుతూ మాక్ సంస్థ సేవలు విశాఖలో ప్రారంభమై.. విదేశాలకు విస్తరించడం గొప్ప విజయమన్నారు. యూబీఐ రీజినల్ మేనేజర్ నరసింహకుమార్ మాట్లాడుతూ, ఇటువంటి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ శ్రీ వల్లి కొర్రపాటి మాట్లాడుతూ ఐదంకెల జీతం వదులుకుని.. పారిశ్రామికవేత్తగా రాణించాలని ఈ రంగంలోకి వచ్చానన్నారు. నారీశక్తి లోన్ పొంది సంస్థను ప్రారంభించిన సందర్భాన్ని వివరించారు. మైనా ఏస్తటిక్స్‌గా యు.కె., అమెరికాలో సేవలు ప్రారంభించామన్నారు. మన దేశంలో 40 ఫ్రాంచైజీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అకాడమీ ప్రారంభించి నిరుద్యోగ యువతకు శిక్షణ అందించి.. ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు.

డీఈఐలో మూడు నెలల కోర్సులు

దరఖాస్తుకు ఈ నెల 31 ఆఖరు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో మూడు నెలల కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి దక్షణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం టై అండ్ డై కోర్సు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం మొబైల్ ఫోన్ రిపేరింగ్, మెయింటెనెన్స్ కోర్సు, డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ కోర్సులు, ఇంటర్ పూర్తి చేసిన వారి కోసం కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరైనా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99633 40611 సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

19న మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ మహాసభ

అనకాపల్లి: ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర 6వ మహాసభ ఈ నెల 19న విజయవాడ హనుమాన్‌పేట సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) కోన లక్ష్మణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలపై చర్చిస్తారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు.

మామిడిపాలెంలో యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

తుమ్మపాల: మండలంలోని మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఆత్మీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో వంద మందికి పైగా దాతలు రక్తదానం చేశారు. పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ విద్యార్థి సేన అనే సంఘంగా ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధ్యక్షుడు పల్లా రాజు తెలిపారు. సేన ఆధ్వర్యంలో 6వ సారి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కేవీఎస్ఎల్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గొల్లవిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోటాడ సింహాచలం, కార్యదర్శి పిల్లా సురేష్, కోశాధికారి వునుకూరి కృష్ణ, కోశాధికారి మొల్లి మురళి, ఆత్మీయ గురువులు రమాదేవి, అప్పలమూర్తి, రమేష్, కొండలరావు పాల్గొన్నారు.

బాబూరావు పాలరాతి విగ్రహావిష్కరణ


బాబూరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెంలో సూర్యనారాయణస్వామి ఆలయ వ్యవస్థాపకుడు, స్వర్గీయ కొణతాల బాబూరావు పాలరాతి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం రాజుపాలెంలో సూర్యనారాయణస్వామి దేవాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. దేవాలయం చుట్టూ స్థానికుల సహకారంతో అంజనేయస్వామి విగ్రహం, అనంత పద్మనాభస్వామి ఆలయం నిర్మించి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చారని కొనియాడారు. ఇటీవల బాబూరావు మృతి చెందడంతో రాజుపాలెం గ్రామ ప్రజలు సహకారంతో మృతుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సన్ని	: పర్తిసాయి
మిస్‌యూ	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
ప్రణయ గోదావరి	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 232 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

గండ్లు పడినా పూడ్చరంతే!


ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నారు. ఆరేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా, శాశ్వత మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. రెండు పెద్ద గండ్లలో ఒక దాన్ని పూడ్చగా, ఇంతలో నదిలో నీరు చేరడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. దాంతో ఏటా పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిన్న గండి నుంచి దిగువకు పోతున్న నీరు


చుక్క నీరు లేని కాలువ


ఉగ్గినపాలెం గ్రోయిన్ పెద్ద గండి నుంచి వృథాగా పోతున్న నీరు

- దిగువకు వృథాగా పోతున్న సాగు నీరు
- ఏటా పంటలు నష్టపోతున్న రైతులు
- ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు అరకొర మరమ్మతులు



కశింకోట: మండలంలోని తేగాడ వద్ద శారదానదిపై ఉన్న ఉగ్గినపాలెం గ్రోయిన్‌ను గాలికొదిలేశారు. పెద్ద గండ్లు పడి దిగువకు నీరు వృథాగా పోతోంది. దశాబ్ద కాలంగా ఆయకట్టుకు సాగునీరు ప్రవహించలేదు. అరకొర మరమ్మతులు తప్ప పూర్తిస్థాయిలో గండ్లు పూడ్చిన పాపాన పోలేదు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు లేక పంటలు దెబ్బతిని ఏటా నష్టపోవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు.

తేగాడ వద్ద శారదానదిపై బ్రిటిష్ వారి హయాంలో ఉగ్గినపాలెం గ్రోయిన్ నిర్మించారు. దీని కింద 500 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఎక్కువగా వర్షాధారంగా సాగు చేస్తారు. ప్రధానంగా కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట, ఉగ్గినపాలెం ప్రాంత భూములకు సాగు నీరు అందుతుండేది. వరి, చెరకు పంటలను సాగు చేస్తారు. అయితే దశాబ్దం క్రితం గ్రోయిన్ నది ప్రవాహ ఉధృతికి దెబ్బతింది. దానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. ఆ భాగం తప్ప మిగిలిన భాగం నది ప్రవాహానికి దెబ్బతింది. ఇలా గతంలోనూ, తర్వాత తరచుగా దెబ్బతినడం తప్ప ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా ఏటా నష్టపోతున్న దుస్థితి ఏర్పడింది.

గతంలో ఎత్తిపోతల పథకానికి పరిశీలన

ఆనకట్ట నిర్మాణ ప్రాంతంలో నది ఉధృతి వల్ల అనువైన ప్రాంతం కాకపోవడంతో తరచుగా దెబ్బతింటూ ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని, దీన్ని మరమ్మతులు చేపట్టే కంటే దిగువన పేరంటాల పాలెం ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగునీరు అందివ్వాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మైక్రో ఇరిగేషన్ కింద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి ప్రయత్నాలు జరిగాయి. అధికారులు పరిశీలన చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో పనులు చేపట్టడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన గ్రోయిన్‌కు మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టాలని, లేదంటే దిగువన పేరంటాలపాలెం వద్ద ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడం ద్వారా గాని ఆయకట్టుకు సాగునీరు అందివ్వడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

6 ఏళ్ల క్రితం నిధులు మంజూరైనా...

ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితం 2019 జనవరిలో గ్రోయిన్‌కు అభివృద్ధి పేరిట రూ.90 లక్షలతో రెండు విడతలుగా శాశ్వత మరమ్మతులు చేయాలని నిర్ణయించి పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గ్రోయిన్‌కు ఉన్న రెండు పెద్ద గండ్లలో ఒక దాన్ని రూ.30 లక్షలు వెచ్చించి పూడ్చారు. ఇంతలో నదిలో వరద నీరు చేరడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ తర్వాత కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులు జరగకపోవడంతో గ్రోయిన్ పనులు ముందుకు సాగలేదు. ఏళ్ల తరబడి ఆయకట్టుకు చుక్క నీరు ప్రవహించడం లేదు. గతంలో పూడ్చిన గండి పక్కనే మరో గండి, గతంలో పూడ్చకుండా నిలిపి వేసిన గండ్ల నుంచి నీరు వృథాగా దిగువకు పోతోంది. దీంతో ఆయకట్టుకు చుక్క నీరు అందక ఏటా నష్టపోవలసి వస్తోందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి



ఉగ్గినపాలెం గ్రోయిన్ నుంచి ఏళ్ల తరబడి చుక్క సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు పండక ఏటా నష్టపోవలసి వస్తోంది. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. లేదంటే పేరంటాలపాలెం ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగు నీరు అందించడానికి చర్యలు తీసుకోవాలి.

–పచ్చికూర నూకరాజు, రైతు, బుచ్చియ్యపేట

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టే విషయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవలసి ఉంది. వారి ఆదేశాల మేరకు గ్రోయిన్‌కు మరమ్మతుల విషయమై చర్యలు తీసుకుంటాం.

ఎం. అమూల్య,
ఏఈ, నీటిపారుదల శాఖ, అనకాపల్లి

గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దు


స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వెంకటప్పారావు

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కష్టాల్లో మునిగిపోయారని, ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగిపోగా, తాజాగా స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ, విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీలు భారం వేయడం అన్యాయమని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బి.వెంకటప్పారావు తెలిపారు. ఆదివారం స్థానిక గవరపాలెం సంతోషిమాత ఆలయం సమీపంలో సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు భారాలు పెంచే స్మార్ట్ మీటర్లను బిగించవద్దని, ట్రూ అప్ చార్జీ, ఎఫ్ ఎఫ్ చార్జీలకు చెల్లించిన సొమ్మును విద్యుత్ శాఖ తిరిగి వినియోగదారులకు వాపసు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తెలయ్యబాబు, మల్లికార్జునరావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు బజారు, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలి

అనకాపల్లి: పట్టణంలో ఇంతవరకూ రైతు బజారు, కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 65వ కిసాన్ మేళా రైతులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అయితే రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. మండలంలో రైతులు కూరగాయలు, ఆకుకూరలు నిత్యం పట్టణంలో గాంధీ కూరగాయల మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఆ సమయంలో రైతు బజారులు లేకపోవడంతో గిట్టుబాటు ధరలు లేకుండా పోయిందన్నారు. ఎండకు, వానకు, చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

పూర్వ విద్యార్థుల సందడి


చిన్న హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో అంతులేని ఆనందాన్ని పొందారు. పదేళ్ల క్రితం పదో తరగతి చదువుకుని వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడి బిజీబిజీగా గడుపుతున్న వారంతా ఏడాదిలో ఒక్క సారైన రోజంతా కలిసి సరదాగా ఉండాలనే ఆలోచనతో ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పట్టణంలో గవరపాలెం చిన్న హైస్కూల్‌కు చెందిన 2004-05 పదో తరగతి విద్యార్థులు సత్యనారాయణపురంలో సత్యనారాయణ స్వామి కొండ వద్ద కలుసుకుని సందడి చేశారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం తరలివచ్చి చిన్ననాటి స్నేహితులను కలుపుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా ఆటపాటలతో సందడి చేశారు. పలు రకాల పిండివంటలు, మాంసాహారాలతో మధ్యాహ్నం వన భోజనాలు చేశారు. ఏటా నిర్వహిస్తూ వస్తున్న ఆత్మీయ కలయిక నేటితో పదేళ్లు పూర్తయిందని, భవిష్యత్‌లో మరింత సందడిగా కొనసాగేలా సహకరించుకుంటూ ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సుమారు వందకుపైగా పూర్వ విద్యార్థులు రావడంతో అందరు ఆనందం వ్యక్తం చేశారు.

బొజ్జన్నకొండ వద్ద

అచ్యుతాపురం మండలం కొండకర్ల జెడ్పీ హైస్కూల్ 1988-89 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని శంకరంలో బొజ్జన్నకొండ వద్ద సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా హాజరై ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


పొట్టిశ్రీరాములు వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాల్లో బాలబాలికలు

తుమ్మపాల: పట్టణంలో పొట్టి శ్రీరాములు భవన్‌లో అమరజీవి పొట్టిశ్రీరాములు 72వ వర్ధంతి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలికలు చేపట్టిన పలు సాస్కృతిక కార్యక్రమాలతో పాటు పొట్టిశ్రీరాములు వేషధారణలో ఏకపాత్రాభినయం చేసిన చిన్నారులకు పొట్టి శ్రీరాములు భవన్ అధ్యక్షుడు పిరట్ల మూర్తి బహుమతులు అందించారు. ఇటీవల నియమితులైన దేవాలయాల చైర్మన్లను సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల దుర్గా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ నిలుపుదల చేయాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్


బాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: విద్యార్థులకు సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఇటీవల మరణించిన టీచర్ ఎమ్మెల్సీ షేక్ బాబ్జి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకూ సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించే సమయంలో ఉపాధ్యాయుల శిక్షణను ప్రభుత్వం వాయిదా వేయాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఏకోపాధ్యాయ పాఠశాలలు చాలా ఎక్కువగా ఉన్నాయని, ఇటువంటి తరుణంలో ఉపాధ్యాయులను శిక్షణ తరగతులతో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో విద్యార్థులతో పరీక్షలు రాయడం కష్టంగా మారుతుందన్నారు. సమ్మేటివ్ పరీక్షలు పూర్తయిన రెండు రోజుల్లో పేపర్లు దిద్ది ఆన్‌లైన్లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా ఉపాధ్యాయులకు విజయనగరం జిల్లాలో శిక్షణ ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. జిల్లాలో ఉపాధ్యాయులు 10 శాతానికి మించి సెలవులు పెట్టరాదని ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని, పదో తరగతి విద్యార్థుల వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో వచ్చే ఏడాది సంక్రాంతి, సెలవు దినాల్లో పాఠశాలలకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు వెంకట్రావు, సహ గౌరవాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, కళింగ సతీష్, శేషుకుమార్, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో లాంగ్ వాకింగ్


లాంగ్ వాకింగ్‌ను జెండాఊపి ప్రారంభిస్తున్న మోనటరింగ్ కమిటీ సభ్యుడు మధుబాబు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయకుమార్

అనకాపల్లి: ప్రతి వ్యక్తి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే నిత్యం వాకింగ్, వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వాగ్ ఫర్ గ్రీన్ రెడ్యూసింగ్ కార్బన్ ఫుట్ లాంగ్ వాకింగ్ కార్యక్రమాన్ని ఆదివారం వారు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం గ్రీన్ క్లబ్‌కు దక్కిందన్నారు. పౌర, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులు, శిలాజ ఇంధన ఉత్పత్తిని భర్తీ చేయడం ద్వారా కార్బన్ పాదముద్రలను తగ్గించడంలో సహాయ పడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని ప్రకృతిని జీవరాశులను సంరక్షించుకోవాలని కార్బన్ పాదముద్రలను ఆఫ్ సెట్ చేయడంలో చెట్లను నాటడం, అడవులను పునరుద్ధరించడం చాలా కీలకమన్నారు. వాకింగ్ కార్యక్రమంలో భాగంగా మెయిన్ రోడ్డులో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి సీఐ టి.వి.విజయకుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బిర వినోద్ కుమార్, సభ్యులు పెంటకోట ఉమామహేశ్వరరావు, పేరూరి చిన్న స్వామి, బేతాళం శేషసాయి, నాయిశెట్టి సత్తిబాబు, రాజేష్, గణేష్, మునగపాక డీటీ వేదూరు శేషు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కూడళ్లలో డ్రోన్ నిఘా


డ్రోన్ కెమెరాలో బంధించిన తాళ్లపాలెం కూడలి

కశింకోట: మండలంలోని జాతీయ రహదారి పొడవునా ప్రమాదాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగే కూడళ్లను సీఐ అల్లు స్వామినాయుడు ఆదివారం పరిశీలించి డ్రోన్ కెమెరాల సహాయంతో ఫొటోలు తీశారు. కశింకోట, బయ్యవరం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి కూడళ్లను ఫొటోలు తీశారు. వీటిపై పరిశీలన చేసి ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జాతీయ రహదారిని ఆనుకున్న గ్రామాల ప్రజలు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు ప్రమాదాలకు గురి కాకుండా వాహనాల రాకపోకలను గమనించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నూకాంబిక ఆలయానికి నూతన సొబగులు


నూకాంబిక ఆలయ ప్రవేశ ద్వారాలకు వేసిన గ్రానైట్ రాయి


నూకాంబిక అమ్మవారికి వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ పూజలు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి నూతన సొబగులు అద్దుకున్నాయి. ఆలయ నిర్వాహకులు, దాతల సహకారంతో రెండు వైపులా ఆలయ ప్రవేశ ద్వారాలు, మెట్ల మార్గాలు, అంతరాలయం భాగంలో గ్రానైట్ రాళ్లతో గచ్చులు, గోడలకు అతికించి అందంగా తీర్చిదిద్దారు. వీటిని అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఇంకా మిగిలిన ఇతర పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరికి పూర్తి కాగలవని, ఇందుకు రూ.11 లక్షలు పైగా వ్యయం కాగలదని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అప్పన్న అన్నదానానికి విరాళాలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన శిరీష్, కాళ్ల పురుషోత్తం అనే దాతలు చెరో రూ.లక్ష చొప్పున విరాళాలు అందించారు. సంబంధిత విరాళాలను సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో సిబ్బందికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిద్ధార్థ అసోసియేషన్ సభ్యులు

తుమ్మపాల: పొట్టి శ్రీరాములు అకుంఠిత దీక్షతో 58 రోజుల పాటు మద్రాస్‌లో ఆమరణ నిరాహారదీక్ష గావించి ఆత్మార్పణ చేసి మన తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించిపెట్టిన గొప్ప మహనీయుడని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో మెయిన్ రోడ్డుపై మహనీయుని విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. నాగభూషణం మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి అమరజీవిగా చరిత్రలో నిలిచిన గొప్ప మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడని కొనియాడారు. అటువంటి మహనీయుని స్మరించుకోవడం ప్రతీ తెలుగువారి బాధ్యతన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకుడు బొడ్డు సోమరాజు, సిద్ధార్థ అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, నందేల అప్పారావు, యర్ర బాబ్జీ, పొట్టి శ్రీరాములు అభిమానులు పాల్గొన్నారు.

వెండి శఠగోపం బహూకరణ

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామ ఇలవేల్పు మోదమాంబకి 30 తులాల వెండి శఠగోపం ఆదివారం సమర్పించారు. విశ్రాంత పోలీసు ఎస్ఐ పోతిన వెంకటరమణ త్రివేణి దంపతులు, వారి కుమార్తెలు జానకీ, వెంకటలక్ష్మి ప్రసన్న లౌక్య ఆర్థిక సహకారంతో అందజేశారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


కశింకోటలో బోనాల ఊరేగింపులో మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట: కశింకోటలో ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రెండు వేర్వేరు బృందాలకు చెందిన భవానీ భక్తులు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. విజయవాడలో కనకదుర్గమ్మ చండీ హోమం పురస్కరించుకొని మార్గశిర మాసం పౌర్ణమి రోజున ఇక్కడ ఆనవాయితీగా ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సంతబయల, గౌరమ్మ ఆలయం ప్రాంతాలకు చెందిన భవానీ భక్తుల బృందాలు వేర్వేరుగా తలపై బోనాలు పెట్టుకొని, వాటిపై దీపాలు నిలిపి ఊరేగింపు నిర్వహించారు. మహిళల కోలాటాలు, తీన్ మార్ వాయిద్యాలు, సంప్రదాయ డప్పులతో ప్రదర్శన చేశారు. స్థానిక సంతబయల నుంచి గవరపేట మీదుగా పెద్దగుమ్మం వరకు బోనాలతో ఊరేగింపు సాగింది. అక్కడ దుర్గమాంబ ఆలయంలో పూజలు చేసి, అనంతరం శారదా నదిలో బోనాలను నిమజ్జనం చేశారు.